నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

# రజతోత్సవ సభను సక్సెస్ చేయండి

**బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్**

ఖానాపూర్, ఏప్రిల్ 14 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను సోమవారం ఖానాపూర్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయనే స్వయంగా గోడలకు వాల్ పోస్టర్లను అంటించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. అనేక పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, అన్ని రంగాల్లో ముందు నిలిపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రజతోత్సవ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజగంగన్న, గౌరికర్ రాజు, ప్రదీప్, ఖలీల్, సుమీత్, గజేందర్, మహేందర్, మెహ్రాజ్, లాజర్, చంద్రవాస్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

ఎదులాపురం : అంబేద్కర్ చౌక్‌లో విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

# అంబేద్కరుడికి ఘన నివాళి

*బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అణగారిన వర్గాల ఆశాకిరణం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలవ్యాప్తంగా సోమవారం అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వివిధ పార్టీల నాయకులు, అంబేద్కర్ సంఘాల నాయకులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. జై భీమ్ నినాదాలు చేశారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి కేక్‌లు కట్ చేశారు. పంచశీల జెండాలను ఆవిష్కరించారు. మాజీ మంత్రి జోగు రామన్న అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోనాల మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఎస్సీ కార్పొరేషన్ ఆవరణ, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.* - నమస్తే నెట్‌వర్క్

సోనాలలో విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# జొన్నల కొనుగోళ్లపై సీలింగ్

- మద్దతు ధర లభించక నష్టం
- కొనుగోళ్లలో జాప్యం.. ఆపై తక్కువ సేకరణ..

**దిగుబడి 18 క్వింటాళ్లు.. కొంటుంది 8.65 క్వింటాళ్లు..**

ఆదిలాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. పంటల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. దీంతో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకున్నది. ఈ ఏడాది యాసంగిలో 79 వేల ఎకరాల్లో రైతులు జొన్న సాగు చేశారు. జిల్లాలో ఏటా యాసంగిలో శనగ పంట అధికంగా సాగవుతుంది. జొన్న సాగు లాభదాయకంగా ఉండడంతో ఈ ఏడాది శనగ కంటే జొన్న విస్తీర్ణం బాగా పెరిగింది. సాగు నీటి కొరత, ఇతర సమస్యలను ఎదురించి రైతులు పంట తీశారు. యాసంగిలో రైతులు సాగు చేసిన జొన్న 14 లక్షల క్వింటాళ్ల వరకు విక్రయానికి వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, నేరెడిగొండ, సిరికొండ, ఉట్నూర్‌లలో పంటను సేకరించాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జొన్న క్వింటాలుకు రూ.3,371 మద్దతు ధర ప్రకటించింది. మూడు రోజుల కింద బోథ్ మండలంలోని ధనోరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

**కొనేది 8.65 క్వింటాళ్లు మాత్రమే..**

రైతులు కష్టపడి సాగు చేసిన పంట కొనుగోళ్లలో ప్రభుత్వం నిబంధనలు విధించడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది. ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు ఇప్పటికే పంటను తీసి చేలు, ఇతర ప్రాంతాల్లో నిల్వచేసి, కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయని ఎదురు చూస్తున్నారు. పండించిన జొన్నలను ఎకరాకు కేవలం 8.65 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసిన రైతులు ఎకరాకు 18నుంచి 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని వినతిపత్రం అందించారు.ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ. 2500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. పంట కొనుగోళ్లపై సీలింగ్ కారణంగా రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి భారీగా నష్టపోయే ప్ర మాదముంది. కొనుగోళ్ల పరిమితిని పెంచాలని సర్కా ర్‌కు లేఖలు రాసినట్లు అధికారులు తెలిపారు.

బోథ్ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన జొన్న పంట

### 18 క్వింటాళ్లు కొనాలి..

నేను యాసంగిలో 20 ఎకరాల్లో జొన్న సాగు చేశా. ఆరెకరాలు సొంత భూమి కాగా 14 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. పంట గింజ దశలో ఉండగా భూగర్భజలాలు అందుగంటి నీరు అందక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాలువ ద్వారా నీటిని మళ్లించి పంటకు నీరు అందించాను. పంట చేతికి వచ్చి 10 రోజులు దాటిన ఇంకా కొనుగోళ్లు ప్రారంభించ లేదు. దీంతో చేల వద్ద నిల్వ చేసిన పంటకు రాత్రి, పగలు కాపలా ఉండాల్సి వస్తుంది. పంట కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిబంధనలు విధించడం సరికాదు. ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎకరాకు 8.65 క్వింటాళ్లు తీసుకుంటామని అధికారులు అంటున్నారు. పండించిన సగం పంట ఎక్కడ అమ్ముకోవాలి. ప్రైవేటులో రూ.2,500 క్వింటాలు కొంటున్నారు. దీంతో రైతులు ఎకరాకు రూ.900 వరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన పంట మొత్తం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

*- శార్థ నవీన్, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం*

## టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో తునికాకు సేకరణ నిషేధం

పెంబి, ఏప్రిల్ 14: పెంబి మండలంలోని టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కోర్ ఏరియాలో ఉండడంతో పెంబి అడవుల్లో తునికాకు సేకరణను నిషేధించామని డీఆర్వో ప్రతాప్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అటవీ ప్రాంతంలోకి వెళ్లి తునికాకు సేకరిస్తే అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి దున్నలు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఏరియాలో తునికాకు సేకరణతో ప్రాణహాని కలిగే ప్రమాదముందన్నారు.

చీక్‌మూన్ వాగులో చెలిమే నీరు తీస్తున్న గిరిజనులు

# కన్నీటి గోస

*పెంబి మండలంలోని దోందారి గ్రామ పంచాయతీ పరిధిలో గల వస్పల్లి కొత్తగుడెం, చాకిరేవు, చాకిరేవు కొత్తగుడెం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈ గ్రామాల్లో దాదాపు 300 మంది నివసిస్తున్నారు. తాగునీటి కోసం గ్రామ శివారులోని కిలోమీటర్ దూరంలో ఉన్న చిక్‌మూన్ వాగుకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ గ్రామాలకు మిషన్ భగీరథ పైపులైన్ కూడా లేదు. అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో పైపులైన్ వేయలేదు. దీంతో వీరికి చేతి పంపు నీరే దిక్కు. ప్రస్తుతం గ్రామాల్లోని చేతిపంపులు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్య తాండవిస్తుంది. ఉదయం, సాయంత్రం గ్రామస్తులు మూకుమ్మడిగా చీక్‌మూన్ వాగుకు వెళ్లి బిందెలు, ఎండ్లబండ్లలో తాగునీరు తెచ్చుకుంటున్నారు.* - పెంబి, ఏప్రిల్ 14

- కిలోమీటరు వెళ్తేనే తాగునీరు
- దోందారి జీపీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి
- తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల వేడుకోలు

చీక్‌మూన్ వాగు నుంచి బిందెలతో తాగునీరు తెచ్చుకుంటున్న గిరిజనులు

వస్పల్లిలో అడుగంటిన చేతి పంపు

### భగీరథ పైపు లైను వేయించండి..

మా గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ లేదు. చేతి పంపు నీరే తాగుతున్నాం. వేసవి సమీపించడంతో చేతిపంపు కూడా అడుగంటిపోయింది. ఉదయం, సాయంత్రం రెండ్లు సార్లు కిలోమీటర్ దూరంలో ఉన్న చీక్‌మూన్ వాగుకు నడుచుకుంటూ వెళ్లి చెలిమే తీసి తాగునీరు తెచ్చుకుంటున్నాం. బిందెలతో కిలోమీటరు నడుచుకుంటూ వెళ్లడంతో ఆయాసం వస్తుంది. మా గోసను అర్థం చేసుకుని నీటి ఎద్దడిని నివారించాలి.

*- పారుబాయి, వస్పల్లి, పెంబి మండలం.*

నీరు రాక చెతిపంపు వద్ద వేచి చూస్తున్న గిరిజనులు

### రోగాల బారిన పడుతున్నాం

చేతి పంపు అడుగంటి పోవడంతో వాగునీరు తెచ్చుకుంటున్నాం. వాగునీరు తాగి రోగాల బారిన పడుతున్నాం. అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో మిషన్ భగీరథ పైపులైన్ మా గ్రామానికి వేయలేదు. అధికారులు స్పందించి మా గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ వేసి తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరుతున్నా.

*- రాహుల్, వస్పల్లి, పెంబి మండలం.*

# పంటలు దగ్ధం

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 14 : మండల కేంద్రానికి చెందిన కళ్లెం విఠల్, కళ్లెం నాగభూషణ్‌ల జొన్న పంట విద్యుత్‌తో ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. రెండెకరాల్లో అన్నదమ్ములు జొన్న వేశారు. పంటను ఒకటి, రెండు రోజుల్లో కొద్దామనేలోపు విద్యుత్ షాక్‌కు గురై కాలి బూడిదైంది. చేనులో ఉన్న జాతర్ల ఫీడర్‌కు 11కేవీ విద్యుత్ లైన్ వెళ్లడంతో గాలి దుమారానికి తీగలు రాపిడికి గురై ప్రమాదం సంభవించినట్లు, సుమారు రూ.1.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

**బోరిగాంలో రెండెకరాల మక్క**

భైంసా టౌన్,ఏప్రిల్ 14: మండలంలోని బోరిగాంకు చెందిన లఖన్ పటేల్ తనకున్న మూడెకరాలలో మక్క పంట సాగు చేశాడు.పంట కోతకు వచ్చింది.సోమవారం చేనులోని విద్యుత్ నియంత్రికలోంచి నిప్పు రవ్వలు పడటంతో మక్క పంటకు నిప్పు అంటుకుంది.దీంతో రెండు ఎకరాల్లో పంట కాలిపోయింది.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

**కుంటాల మండలంలో మొక్కజొన్న..**

కుంటాల, ఏప్రిల్ 14 : లింబా(కే)లో రైతు ము కుంద గంగాధర్ పటేల్ రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న వేశాడు. సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. 100 క్వింటాళ్ల వరకు చేతికొచ్చే పంట అగ్నికి ఆహుతైం ది. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

కుంటాలలో దగ్ధమైన మొక్కజొన్న పంట